‘అక్కడ ఏమీ లేందే పైనేం చూస్తున్నారు?’ అడిగాడు జగ్గూ.

‘ఆలోచిస్తున్నాం .... హాహాహా.....’ అన్నాడు వీరూ.

‘నీ మొహం మాండా ..... నువ్వు సమాధానం చెప్తున్నది నాకు..... నాతో మాట్లాడేటప్పుడు నువ్వలా నవ్వ నక్కర్లా....’ జగ్గీ వీరూ వంక చూసి పళ్ళు నూరాడు.

వీరూ నాలుక కొరుక్కుని చెంపలేసుకున్నాడు.

మళ్ళీ ఇంటి కప్పువంక ఓ క్షణం పాటు చూసి ఒక్కసారిగా ‘హా....’ అన్నాడు గుర్తుకు వచ్చి.

రాంబాబు కూడా అప్పుడే ‘హా.....’ అన్నాడు. అతనికి కూడా గుర్తుకువచ్చింది హిమాయత్ నగర్ దగ్గర వీరూతో జరిగిన సంఘటన.

‘ఒరేయ్..... ఆ రోజు నువ్వే కదూ నాకు డ్యాష్ కొట్టింది...... ఆ రోజు తప్పించుకున్నావుగానీ ఈ రోజు తప్పించుకోలేవు..... ఆ రోజు నా నగ కూడా పోయింది..... దాన్ని నువ్వే కొటేశావా? అన్నాడు పిడికిలి బిగించి అడుగులు ముందుకు వేస్తూ.

‘ఇదిగో ..... అలా నువ్వూ నువ్వూ అంటే ఎలా? ..... కొత్త్వాళ్ళకి మర్యాద ఇవ్వాలి కదా?.....’ అన్నాడు రాంబాబు అడుగులు వెనక్కి వేస్తూ.

వీరూ చిటికె వేసి చెయ్యి విదిలించి నాలుక ఓ మారు కొరికి ‘అ(రె! సారీ అండి..... నా నగేం చేశారు మీరు? అన్నాడు.

జగ్గూ భరింపరాని వేదన అనుభవిస్తూ తల విదిలించి నువ్వు మన గ్యాంగులో ఉండతగ్గ వాడివి కావు అందరికి ఇలా మర్యాద ఇస్తే అయినట్టే....’ అన్నాడు.

వీరూ మళ్ళీ చిటికేవేసి చెయ్యి విదిలించి నాలుక కొరుక్కుని ‘హు....నగేం చేశావు చెప్పు?’ అన్నాడు రాంబాబువైపు మరో అడుగు వేస్తూ. ‘నగా?.....ఏం నగ?..... నాకేం తెలీదు..... అన్నాడు రాంబాబు తనూ ఒక అడుగు వెనక్కి వేస్తూ.

నిజంసార్ ..... మా గురూగారికి మీ నగ గురిచి అసలేం తేలీదు....’ అన్నాడు కిష్టయ్య కూదా రాంబాబుకి వంతపాడుతూ.

వీరూ, జగ్గూ ఒకరి ముఖాలు ఒకరు చూసుకున్నారు.

జగ్గూ వీరూకి కన్నుకొట్టాడు.

వీరూ కూడా జగ్గూకి కన్నుకొట్టాలని ప్రయత్నించాడు కానీ చేత కాలేదు. వీరూ ఒక కన్నుకొడితే దాంతో బాటు రెండో కన్ను కూడా మూసుకుపోతుంది. ఎంత ప్రయత్నించినా కేవలం ఒక కన్నే మూద్దమంటే కుదరడంలేదు.

కిష్టయ్య వీరూవంక ఆశ్చర్యంగా చూశాడు.

‘అసలు కన్నుకొట్టడం రానివాళ్ళూ మీరు రౌడీ ఎలా అయ్యారు సార్?....’ అన్నాడు వీరూతో.

వీరూ క్రోధంతో హూంకరించి తల విదిలించాడు.

'హు..... ఇప్పుడు చూడు'

మళ్ళీ కన్ను కొట్టడానికి ప్రయత్నించాడు గానీ రాలేదు.

ఛీ....నీ బతుకు పాడుగాను ..... కన్ను కూడా కొట్టడం రానివాడివి నువ్వు మా గ్యాంగులో ఎల ఉన్నావ్? బిగ్ బాస్ కి నీ విషయం తెలిస్తే నీ ప్రొబేషన్ మరో మూడునెలలకి పెంచుతాడు.... ఎంత అవమానం.... హవ్వ!' జగ్గూ మూతిమీద అరచేత్తో కొట్టుకున్నాడు.

వీరూ అవమాన భారం భరించలేక గుండు వొంచుకున్నాడు.

'తరువాత తీరిగ్గా సిగ్గుపడుదువుగానిలే. రేపటినుండి పొద్దున్నే లేచి కన్ను కొట్టడం, విజిలెయ్యడం లాంటివి ప్రాక్టీసు చెయ్యి....' అన్నాడు జగ్గూ వాత్సల్యంగా వీరూ వంక చూస్తూ.

వీరూ బుద్ధిగా తల ఊపాడు.

జగ్గూ మళ్ళీ వీరూ వంక చూసి కన్నుకొట్టాడు.

వీరూ జగ్గూకి కన్ను కొట్టబోయి మళ్ళీ ఎక్కడ సిగ్గుపడాల్సివస్తుందోనని ఆ ప్రయత్నం మాని 'నే(నెడీ' అన్నాడు జగ్గూతో.

జగ్గూ, వీరూ హఠాత్తుగా పిడికిళ్ళు బిగించి రివ్వున బుల్లెట్స్ ల రాంబాబు, కిష్టయ్యల వైపు దూసుకువెళ్ళారు వాళ్ళనిఎటాక్ చేయడంకోసం.

రెప్పపాటులో జరగాల్సింది జరిగిపోయింది.

'ఢాం.....తనేల్.....'

రెండు పెద్దశబ్దాలు!!.... వాటితోబాటే 'అమ్మోయ్..... నాయనోయ్' అని భయంకరమైన రెండు ఆర్తనాదాలు ఆ గదిగోడలమధ్య ప్రతిధ్వనించాయ్.

## *ఫ్రేమ్ - 18*

### *తన్నబోయితిన్నారు*

రాంబాబు కిష్టయ్య ఒకరి ముఖాలు ఒకరు ఆశ్చర్యంగా చూసుకున్నారు.

ఆ ఆర్తనాదాలు చేసింది వాళ్ళుకాదు.

తమని తన్నాలని అనుకున్న జగ్గూ. వీరూ ఎందుకంత హృదయ విదారంగా అరిచారు?....

మెల్లగా వెనక్కి తిరిగి చూశారు రాంబాబు, కిష్టయ్య.

గోడదగ్గర జగ్గూ, వీరూ ఇద్దరూ చతికిలబడి ఉన్నారు. ఇద్దరూ ఇస్సూ ఇస్సూ అనుకుంటూ నుదురు రుద్దుకోసాగారు.

రాంబాబునీ కిష్టయ్యనీ కొడ్దామని బుల్లెట్స్ లా ముందుకు దూసుకువచ్చిన జగ్గూ. వీరూ వాళ్ళిద్దరూ చాకచక్యంతో మెరుపులా పక్కకి తప్పుకోడంతో నొసళ్ళూ మీదా బొడిపెలు లేచాయి.

వాళ్ళిద్దరు గుర్రగుర్రుమంటూ రాంబాబు కిష్టయ్యల వంకచూస్తూ పిడికిళ్ళు బిగిస్తూ లేచి నిలబడ్డారు.

రాంబాబు చాలా కంగారు పడిపోయాడు.

‘అందుకే సార్ .... మీరెందుకు మమ్మల్ని కొట్టాలని ప్రయత్నించాలి-- మేమెందుకు తప్పించుకోవాలి. మీరెందుకు దెబ్బలు తినాలి?.... దయ చేసి వెళ్ళిపొండిసార్....’ అన్నాడు జగ్గూ, వీరూతో.

‘ఏం కూశావ్?..... మేం దెబ్బలు తింటామా?..... చూస్తావా మతడాఖా.....’ జగ్గూ హుంకరించి వీరూకేసి చూస్తూ కన్నుకొట్టాడు.

వీరూ కూడా కన్నుకొట్టాడానికి ప్రయత్నించాడు గానీ రాలేదు.... మళ్ళీ ప్రయత్నించాడు.... అయినా రాలేదు. మరోసారి ప్రయత్నించాడు..... ఉహు.... రెండుకళ్ళూ మూస్కుంటున్నాయి గాని ఒక కన్ను కొట్టడం రావడం లేదు.

జగ్గూ వీరూ వ్యర్థ ప్రయత్నాలు చూస్తూ భయంకరమైన వేదనకు గురయ్యాడు.

‘నా కర్మకొద్దీ దొరికావ్..... నీకు కన్నుకొట్టడంకూడా రాదని తెలిస్తే నీ ప్రొబెషన్ మరో ముడునెలలకి ఎక్స్‌టెండ్ చేస్తాడు బిగ్ బాస్ .... కర్మ కర్మ....’ అంటూ నొసలు మీద కొట్టుకుంటూ.

బాధగా ‘బాబోయ్’ అని అరిచి నొసలు మీద ఉన్న బొడిపెను భయంభయంగా తడుముకున్నాడు జగ్గూ.....

‘సారీ జగ్గు.... ఇకముందు నేను కన్నుకొట్టడం బాగా ప్రాక్టీసు చేస్తా.....’ అన్నాడు వీరూ సిగ్గుతో చితికిపోతూ.

‘అలాగే ఈల వెయ్యడం కూడా ప్రాక్టీస్ చెయ్యి వీరూ....’

వీరూ బుద్ధిగా తల ఊపాడు.

జగ్గు మళ్ళీ వీరూ వంక చూసి కన్ను కొట్టాడు. వీరూ ‘నేను రెడీ’ అన్నాడు.

మళ్ళీ ఇద్దరూ పిడికిళ్ళు బిగించి షరవేగంతో రాంబాబునీ కిష్టయ్యనీ ఢీకొనడానికి ముందు ఉరికారు.

మళ్ళీ అదే మెళుకువతో రాంబాబూ, కిష్టయ్య పక్కకి తప్పుకున్నారు.

అంతే .....

జగ్గూ, వీరూ సర్రుమంటూ వీధి తలుపులోంచి బయటికి దూసుకుపోయి బ్యాలెన్స్ ఔటయిపోయి రోడ్డుమీద థనల్‌మని పడ్డారు.

‘హబ్బా..... హమ్మా.... హహహ.....’ అన్నాడు వీరూ మోకాళ్ళు మోచిప్ప తో తుడుముకుంటూ.

‘నీబొంద..... మనం వాళ్ళని తన్నినప్పుడు నవ్వాలి!.... మనం దెబ్బలు తిన్నప్పుడు కాదు.... ఎప్పుడు నవ్వాలో కూడా తెలీదు నీకు.....’ విసుక్కున్నాడు జగ్గూ.

జగ్గూ, వీరూ కిందనుండి లేవబోయారు కానీ లేవలేకపోయారు. అంత భారీ శరీరాలు శరవేగంతో ముందుకు దూసుకువెళ్ళి పడడంతో బాగా దెబ్బలు తగిలాయ్, వాళ్ళ కళ్ళు బైర్లు కమ్మాయి.

గదిలోపల రాంబాబు కంగారు పడసాగాడు మళ్ళీ వాళ్ళిద్దరూ లోపలికి వచ్చి తంతారని.

‘అలా కంగారుపడితే లాభం లేదు గురూగారు మీరు వెంటనే వీధి తలుపు మూసేసి గడియ పెట్టెయ్యండి. మన దొడ్డివైపునుండి బస్టాండుకి వెళ్ళిపోదాం.....’ అన్నాడు కిష్టయ్య సూట్ కేసు తన చేతిసంచి అందుకుంటూ.

రాంబాబు వీధి తలుపు మూస్తుండగా వీధిలో మట్టిలో పొర్లుతున్న జగ్గూ వీరూ గట్టిగా అరిచారు.

‘ఒరేయ్ ఆగురా .... నీ పని పడ్తాం .....’ అంటూ.

రాంబాబు, కిష్టయ్య దొడ్డిదోవ నుండి బయటికి వచ్చి వెనుక తలుపుకి తాళం పెట్టి రోడ్డుమీద పడ్డారు . వాళ్ళ అదృష్టంబాగుండి అటుగా ఒక ఖాళీ ఆటో వచ్చింది.

ఇద్దరూ ఆటో ఎక్కారు.

‘బస్టాండు పోనీ.....’ అన్నాడు రాంబాబు.   ఆటో రివ్వున ముందుకు కదిలింది.

ఇటువైపు....

జగ్గు, వీరూ ముక్కుతూ మూలుగుతూ లేచి కుంటుకుంటూ వీధి తలుపు సమీపించారు.

‘తలుపు.... తలుపు తియ్యరా.....’ జగ్గు దబ దబ తలుపు మీద బాదాడు.

వీరూ కూడా తలుపుమీద ఒక గుద్దిగుద్ది భయంకరంగా ఆర్తనాదం చేసి చేతివంక చూస్కున్నాడు. ఆ చేతికి బాగా దెబ్బలు తగిలి ఉన్నాయ్.

రెండు నిముషాలపాటు తలుపుమీద బాదాడు జగ్గూ.

తరువాత తలుపుకి చెవి ఆనించి విన్నాడు. ఒక నిముషం పాటు లోపలినుండి ఏ విధమైన అలికిడి వినబటడం లేదు.

‘వాళ్ళు పారిపోయినట్టున్నారు!.....’ అన్నాడు జగ్గూ వీరూ వంక చూస్తూ.

ఇద్దరూ గబగబా కుంటుకుంటూ ఇంటి వెనకవైపుకి వెళ్ళి చూశారు. వెనక తలుపు తాళం వేసి ఉంది.

జగ్గూ, వీరూ వెనక వీధిలోని ఒకరిద్దర్ని అడిగారు రాంబాబుని చూశారా అని. ఒక వ్య క్తి వాళ్ళకి చెప్పాడు రాంబాబు, కిష్టయ్య సూట్ కేస్ తీసుకొని ఆటో ఎక్కి వెళ్ళినట్టు.

బహుశా బస్టాండుకి వెళ్ళుంటారు..... పద.....’ అన్నాడు జగ్గూ వీరూతో.

ఇద్దరూ తమ బుల్లెట్ ఎక్కి బస్టండ్ కి వెళ్ళారు. వీళ్ళు బస్టాండుకి చేరేసరికి అప్పుడే బస్తాండు నుండి తాడేపల్లి గూడెం వెళ్ళే బస్సు బయలుదేరి వెళ్ళిపోవడం కనిపించింది.

‘అదిగో ..... వాళ్ళు ఆ బస్సులో ఉన్నారు!’

కిటికీ దగ్గర కూర్చుని ఉన్న రాంబాబు కిష్టయ్యని చూస్తూ అరిచాడు జగ్గూ.

‘మన దెబ్బకి ఊరే వదలిపెట్టి వెళ్తున్నారు..... హహహ.....’ అంటూ నవ్వాడు భయంకరంగా  వీరూ.

బస్తాండులోని జనం మొత్తం వీరూ వంక చూశారు విస్మయంతో.

‘స్థలం కాని స్థలంలో ..... వేళకాని వేళలో ఆ నవ్వేంటి ...... నోర్మూయ్ .....’ జగ్గూ వీరూ

మీద విసుక్కున్నాడు.

### *సీరియస్ వ్యవహారం*

తాడేపల్లి గూడెంలో బస్సు దిగగానే రాంబాబు, కిష్టయ్యలు ఎవరిళ్ళకు వాళ్ళు వెళ్ళిపోయారు.

రాంబాబుకి ఇంటి గుమ్మంలోనే తండ్రి ఎదురయ్యాడు.

'ఏంటి ?.... మీరు బాగానే ఉన్నారా?....' తండ్రి పరంథామయ్యని చూస్తూనే రాంబాబు ఆశ్చర్యంగా అడిగాడు.

పరంథామయ్య ముఖం చిట్లించాడు.

'ఏంటి నీ ఉద్దేశం? .... నేను బాగుండకూడదా? ఆ ప్రశ్నేంటి ఆ వ్యవహారం ఏంటి?....'

రాంబాబు తడబడ్డాడు.

'అదికాదు ..... మరి సీరియస్ గా ఉందని టెలిగ్రాం ఇచ్చారుగా?.....' నసిగాడు.

'అంటే నీకలా టెలిగ్రాం ఇచ్చిన నేరానికి నేను నువ్వొచ్చేసరికి మంచం పట్టిపోయి ఉండాలనా?..... ఆ టెలిగ్రాం అబద్దం అయిపోయినందుకు బాధపడ్తున్నావా? నీ వ్యవహారం నాకేం నచ్చలేదు.....' అన్నాడు పరంథామయ్య పెద్ద గొంతుతో.

'మరి సీరియస్ గా ఉందని టెలిగ్రాం ఎందుకిచ్చారు?.....' రాంబాబు బుర్రగోక్కుంటూ గొణిగాడు.

'నీ వ్యవహారం గురించి సీరియస్ గా ఆలోచిస్తున్నాను..... అందుకని సీరియస్ గా ఉన్నానని టెలిగ్రాం ఇచ్చాను.....ఏం ఇవ్వకూడదా ?.... నీ వ్యవహారం తేల్చాలనే ఇక్కడికి వెంటనే పిలిపించాను.....'

రాంబాబు గుండెల్లో రాయిపడింది. సరోజతో తన ప్రేమ గురించి నాన్నకి తెలిసిపోలేదు కద?....

'అదా?....అదీ అసలు వ్యవహారం అంటే .... వ్యవహారం కాదుగానీ .... చెప్దామనే అనుకున్నాను .... కానీ, టైము ఇంకా రాలేదనీ ..... అసలేం జరిగిదంటే .....' రాంబాబు తడబడసాగాడు. పరంథమయ్య రాంబాబు వంక ఆశ్చర్యంగా చూశాడు.

'నువ్వు చెప్పడమేంటి?.... నీ వ్యవహారం బొత్తిగా గంద్రగోళంగా ఉంది..... నేను నీకింకా ఆ వ్యవహారం గురించి చెప్పందే నువ్వు నాకు చెప్పడం ఏంటి?.... ఇంతకీ నువ్వు చెప్పబోయేది ఏ వ్యవహారం గురించి?.....'

ఇంతలో వరండాలోకి వచ్చిన రాజ్యలక్ష్మి అన్నయ్యని చూసి గట్టిగా కేకేసింది.

'అమ్మాయ్..... అన్నయ్యొచ్చాడే.....'

ఆ కేక విన్న పార్వతమ్మ వంట గదిలోంచి పరుగున వచ్చింది.

'ఎప్పుడొచ్చావురా....? అదేంట్రా అలా చిక్కిపోయావ్?....' అంది పార్వతమ్మ కొడుకు వంక ప్రేమ నిండిన దృక్కులతో చూస్తూ.

రాంబాబు తన శరీరం వంక తాను ఆశ్చర్యంగా వంక ఆశ్చర్యంగా చూశారు.

'నీదంతా అడ్డదిడ్డా వ్యవహారం...... వాడెక్కడచిక్కాడు.... ఇదివరకటికంటే లావెక్కు వైతానూ?.....' అన్నాడు భార్యతో పరంధామయ్య.

'సర్లేండి ..... కన్నబిడ్డలని అలా పలకరించకపోతే.....ఏరా నాయనా...... దుక్కలా బలిశావే...... అని పలకరించాలా?....' అంది పార్వతమ్మ.

'సరేగానీ..... ఇందాక నువ్వేదో వ్యవహారం చెప్దామని అనుకున్నట్టు..... ఇంకా టైము రాలేదనీ అంటున్నావు.... ఏంటా వ్యవహారం......?' పరంధామయ్య రాంబాబు వంక సూటిగా చూస్తూ అడిగాడు....

'అబ్బబ్బ..... ఇందాకట్నుండీ అబ్బాయిని గుమ్మంలో నిలబెట్టే మాట్లాడుతున్నారు కదా..... వాడిని లోపలికి రానివ్వరా?... అమ్మాయ్..... అన్నయ్య కాళ్ళకి నీళ్ళివ్వమ్మా....' పార్వతమ్మ భర్త మాటలకి అడ్డుతగిలింది.

రాంబాబు హమ్మయ్య అనుకుంటూ నిట్టూర్చాడు. చెల్లెలు ఇచ్చిన నీళ్ళతో కాళ్ళు కడుక్కొని ఇంట్లోకి అడుగుపెట్టాడు రాంబాబు.

రాత్రి భోజనాలు అయ్యాక మళ్ళీ అడిగాడు పరంధామయ్య రాంబాబుని.

'అవునుగానీ.... ఇందాక నువ్వేదో వ్యవహారం గురించి చెప్దామని అనుకున్నట్టున్నావ్ ..... ఏంటది?.....'

'ఏం లేదులే ..... నా ఫోటో స్టూడియో గురించి చెప్దామని అనుకున్నా.... మొదట్లో వ్యాపారం అత బాగాలేదుగానీ ఇప్పుడు బాగానే ఉంది .....' రాంబాబు తడబడుతూ అబద్ధం ఆడాడు.

'ఓహో .... స్టూడియో వ్యవహారం గురించా?.... ఆ మాత్రం దానికి కంగారు ఎందుకూ?....'

'ఉంటున్నది హైదరాబాద్ కదా.... ఉదయం లేచింది మొదలు లైఫ్ చాలా బిజీగా ఒకటే పరుగో పరుగుగా ఉంటుంది.... ఎప్పుడూ కంగారే..... అందుకే అలా కంగారుపడడం అలవాటైపోయింది....' అన్నాడు రాంబాబు కంగారుగా.

'అన్నయ్యా.... మరేమో హైదరాబాద్ నుండి నాకేంతెచ్చావ్ ?...' అని అడిగింది రాజ్యలక్ష్మి.

'కంగారులో ఏమీ తేలేదమ్మా....' అన్నాడు రాంబాబు.

'ప్రతీదానికీ అలా కంగారుపడ్తే ఎలారా బాబు.... అసలు తిండైనా సరిగ్గా తింటున్నావా అక్కడ?......' అడిగింది పార్వతమ్మ.